కథానిక

ఉమాకాంత్ (లేక) (చిత్రకారుడు)

శ్రీ బుద్ధవరపు వేంకటరత్నం

ఆసుపత్రిలో అంతా నిశ్శబ్దంగా వున్నారు. లోపల డాక్టరు రోగిని తీక్షణంగా పరీక్షిస్తున్నాడు. గదికి బయట వున్న యిద్దరు ముగ్గురు వ్యక్తులు ప్రతీనిముషం ఆత్రుతతో లోపలికి చూస్తున్నారు. ఆ మధ్యాహ్నపు వేళ తదేక దీక్షతో రోగిని చూస్తూంటే డాక్టరుముఖం నిండా చమట పట్టివుంది. కొంతసేపటికి బయటకి వచ్చాడు డాక్టరు నిట్టూర్పుతో.

'డాక్టరుగారూ, మాబిడ్డ...ఎలా వున్నాడు?' అన్నాడు అక్కడే వున్న వొక వ్యక్తి. రోగికి తండ్రి కాబోలు. వయస్సేమీ పెద్దదికాదు. అయినా ముఖంలో విరక్తిరేఖలూ, విషాద ఛాయలూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

డాక్టరు ఏదో ఆలోచిస్తూంటే "అయ్యా! మా బిడ్డడికి మామూలుగా వస్తూంటుంది యీ వ్యాధి. ఈసారి అకస్మాత్తుగా బడినుంచి యింటికి వస్తూంటే వచ్చిందిట, దారిలో పడిపోయి, గాయాలు తగిలి కొట్టుకొంటూంటే పాపం! యీయన దయతో మీదగ్గిరకి తీసుకొచ్చేరుట...ఇంకా ఏమిటో అంటున్నాడు అక్కడే ప్రక్కన వున్న పెద్దమనిషిని డాక్టరుకు చూపుతూ.

'ఆఁ! మూర్ఛా! ఇంత చిన్న వయస్సులోనే ఎలా వచ్చిందీ అబ్బాయికి? ఇంతకిముందీతనికి అకస్మాత్తుగా ఏదేనా విపత్తు కలిగిందా?' అని అడిగాడు డాక్టరు ఆతణ్ణి. వ్యక్తికళ్లు అశ్రుపూరితములైనాయి. 'బాబూ! ఏంచెప్పను? రెండేండ్లయింది. వీడికీ నాకూ ప్రేమపాత్రురాలైన తల్లి గతించి. ఒక్కక్షణం తల్లి లేకపోతే, గిజగిజలాడేవాడు. ఆ దేవి గతించిన నాటినుండీ నాకీ పిచ్చీ, వాడికీ వ్యాధీ పట్టుకొన్నాయి. ఎలాగైనా నయంచేసి మళ్లీరాకుండా చేస్తిరా జన్మల్లా మీపేరు చెప్పుకొని బ్రతుకుతాం. మందులకి ఖర్చులిచ్చుకుంటూ. ఏవో పేదవాళ్లం...' అంటూ దీనంగా ప్రార్థేయపడ్డాడు.

పూర్తిగా కాకపోయినా డాక్టరుకి కొంతేనా ఇపుడు అర్థమయ్యింది రోగిసంగతి. చిరునవ్వుతో "ఏం ఫర్వాలేదు.- మీరు ఇంటికి వెళ్లి చల్లబడ్డాకా రండి. మీ పేరు?' అన్నాడు.

'ఉమాకాంత్ అంటారు నన్ను. ఏ ఉద్యోగం లేదు అప్పుడప్పుడు ఏవో బొమ్మలు గీసుకు బ్రతుకుతూ వుంటా. దయచూడాలి. తను రెప్పడు రమ్మన్నా వస్తా. డాక్టరుగారూ! వాడే నా ఆశ. వాడే లేకపోతే వాళ్లమ్మపోయినా వాణ్ణి చూస్తూ బ్రతుకుతూన్న ఈ ప్రాణి యిక వుండలేదు. అన్నాడు వ్యక్తి.

'ఉమాకాంత్! ఇప్పుడిక్కడెవ్వరూ వుండకూడదు. అబ్బాయికి నిద్రపట్టింది. ఇంటికెళ్లి మళ్లీ రా' అన్నాడు డాక్టరు.

ఆసుపత్రి మెట్లు దిగి ఎండలో ఇంటిదారి పట్టాడు ఉమాకాంత్. వీధినిబడి నడుస్తున్నాడే కాని మనస్సు మనసులో లేదు. తనని మఱపించి ఊరించి కటికచీకటిలోంచి మార్గంలోకి లాక్కువస్తూన్న ఏదో నక్షత్రం మినుకుమినుకు మంటూ క్రుంగిపోతున్నట్లుంది. ఆ తార గూడా రాలిపోతే ఇంక ఎలా బ్రదికేది? అతిప్రేమతో తనతో జీవించిన అర్థాంగి పోయినా ఆమెకోరిక కోసం ఆ బిడ్డని పెంచుతూ తన బ్రదుకుని బరువుగా సాగిస్తున్నాడు. పిచ్చిపిచ్చి ఆలోచనల్తో ఇంట్లోకి వచ్చాడు.

పట్నంలో జనసమ్మర్దమైన రోడ్డువారఇల్లు వాళ్లది. బయట ఎప్పుడూ బజారు రొదపెడుతూ వుంటుంది. ఆ గుప్పెడు కొంపలో ఒక గదిలో ఒకమూల బల్ల, రంగుచిప్పలూ' కుంచెలు, కాగితపు ముక్కలూ ఇవీ అతని ప్రపంచం. ఇంకో మూల తన కొడుకు రవిపుస్తకాలూ బట్టలూ, వుంటాయి. ఎలాగో లేవలేని చేతుల్ని పైకెత్తి తాళం తీసి లోపలికి అడుగుపెట్టాడు.

ఎండలోంచి ఒక్కసారిగా ఇంట్లోకి రావడంవల్ల కళ్లు చీకట్లుకమ్మాయి. కాని ఆలోచనలతో పరితపించే ఆ హృదయంలో ప్రకృతి మార్పుని గుర్తించలేకపోయింది. ఆ క్షణంలో అతడికి ఏమీ కనపడ్డం లేదు. ఇంట్లోదాకా బయటనుంచి తీసుకొచ్చిన కాంతి గుప్పున ఆరిపోయిన ట్లయింది. లోపలికి వచ్చిరావడంతోనే తలెత్తి ఎదుటిగోడవైపు చూశాడు. కళ్లు నులుముకొని, పొంగివచ్చే కన్నీళ్లను ఒత్తుకొంటూ తదేక దీక్షగా అక్కడ వున్న పటంవైపు చూస్తున్నాడు.

తన భార్య శశిరేఖచిత్రం అక్కడ వుంది. రెండేండ్లక్రితం గతించింది ఆమె. పోతూపోతూ తన బిడ్డ రవిని ఆశాకిరణంగా అందించింది భర్తకి. ఉమాకాంత్‌కి ఆచిత్రం చూస్తూంటే తన భార్యకడసారిమాటలు జ్ఞాపక మొస్తున్నాయి.

"మీరు కళాకారులు. ఎప్పుడూ దేన్నో గురించి తీక్షణంగా ఆలోచిస్తూంటారు. ఈ రవి మీ, నా ప్రేమఫలం. మన వంశానికి ఒక్కడే పట్టుకొమ్మ. మీది పవిత్రమైన కళాకారుల, సాంస్కృతిక సేవకుల వంశం. ఆవంశగౌరవాన్నీ, ఆ పరంపరాగతచిహ్నమైన యీ పిల్లవాణ్ణి ప్రేమతో పెంచి పెద్దవాణ్ణి చెయ్యండి. వీడిలో వున్న నన్ను చూసి తృప్తిపడండి. కళ్ల నీళ్లు పెట్టుకోకండి. శలవు. వీణ్ణి నాలానే చూస్తానని వాగ్దానం చెయ్యండి...'అంటూ చేయి చాచింది అంతిమస్వరంతో. కన్నీళ్లతో చేతిలో చేయి వుంచి సాగనంపాడు ప్రపంచంలోంచి ఆ సాధ్విని. అప్పటినుండీ రవిమీద మమకారంతో మళ్ళీ వివాహమేనా చేసుకోకుండా కళాజీవితంతో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు ఉమాకాంత్. ఇప్పుడతనికి ఆ దృశ్యమంతా ముందుంది.

'శశి! నా సర్వస్వం అర్పించి నా మాట కాపాడుతా, ప్రాణాల్నిసైతం ఒడ్డి క్షీణించే వంశగౌరవాన్నీ, రవినీ రక్షిస్తా.' అన్నాడు బిగ్గరగా నిజంగా శశిరేఖ తనఎదుట వున్నట్లే భావిస్తూ పిచ్చిగా.

రోజూ రవి ఎన్ని పనులున్నాసరే తల్లి పటానికి పూలమాల లుంచి, ప్రక్కనే వున్న తన తండ్రి చిత్రించిన భారతమాతచిత్రానికి పూజించి మాతృభక్తితో సేవిస్తూండేవాడు ఆవాళ రవి ఇంటి దగ్గర లేకపోవడంచేత ఉమాకాంతుడే ఆ పనులు పూర్తిచేశాడు. సాయంకాలం ఎప్పుడౌతుందా? అని ఎదురుచూస్తున్నాడు. ప్రక్కయింట్లో గడియారం 8 గంటలు కొట్టింది. వేసవికాలంమూలాన కాలం ఎలా తిరుగుతోందీ ఉమాకాంత్ గుర్తించలేకపోతున్నాడు మనసులో బాధవల్ల. వెంటనే బయలుదేరాడు. చిన్న పిల్లవాడిలా ఆసుపత్రికి పరుగెత్తుకు వచ్చాడు.

డాక్టరు హాల్లో కూర్చున్నాడు. ఉమాకాంతుడు రాగానే 'రండి కూర్చోండి' అబ్బాయికేమీ ఫర్వాలేదు. కాని గుండెమీద గట్టి దెబ్బ తగిలింది. ప్రాణాపాయం ఏమీ లేదు; రెండు నెలలపాటు ఇల్లు కదలనీయకుండా జాగ్రత్తగా చూడాలి. ఏమరుపాటుగా వుండగా ఈ వ్యాధి వస్తే చాలా ప్రమాదం. పదిరోజులైనతర్వాత మీ యింటికి తీసికెళ్లవచ్చు. మందులు కావలసినవన్నీ నేనే తెప్పించి వాడుతా. తరువాత డబ్బుమాట చూసుకొందాం' అన్నాడు.

ఈ మాటలు వింటూంటే ఉమాకాంత్‌కి ప్రాణం వచ్చినట్లుంది. శశి తనముందు సంతోషంతో నవ్వుతున్నట్లుంది. ఆనందంతో అలాగే 'డాక్టరుగారూ. మీ ఇష్టం కానీండి' అన్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి. 15 రోజుల తర్వాత రవిని ఇంటికి పంపించాడు డాక్టరు. రోజూ మందు పంపుతూండేవాడు. మాతృదేవి పూజతప్ప రవి మరోపనేదీ చేయడానికి తండ్రి ఒప్పుకొనేవాడు కాదు. ఇంట్లో పనులన్నీ ఉమాకాంతుడే చేస్తూండేవాడు. వీ లున్నపుడల్లా ఇంటిదగ్గరే పాఠం చెబుతూండేవాడు కొడుక్కి. కాలచక్రం మళ్లిపోతోంది. రెండు నెలలూ గడచిపోయాయి.

'ఇంక మందక్కర్లేదు. కానీ అబ్బాయి ధ్యానం మాత్రం కొంచెం మళ్లించడానికి ప్రయత్నించేస్తే ఆ మానసికచైతన్యంవల్ల పూర్తిగా వ్యాధినివారిస్తుంది' అన్నాడొకనాడు డాక్టరు.

'తల్లిప్రేమనుండి తప్పించడమెలా డాక్టరుగారూ?' అన్నాడు ఉమాకాంత్ వగ్గుత్తికతో.

'ఉమాకాంత్! మీవాడు రోజూ తల్లి పటానికీ, భారతమాతచిత్రానికీ పూజిస్తూంటాడు. గనక నెమ్మదిగా దేశాన్ని గురించీ, భారతమాతని గురించీ చెబుతూ మనస్సుని మళ్ళించు' అన్నాడు డాక్టర్. రవిస్థితినిబట్టి ఇది సాధ్యమే అనిపించింది ఉమాకాంత్‌కి. మరునాటినుంచి ప్రారంభించాడు ఉమాకాంత్ డాక్టరు చెప్పిన ఉపాయం. రోజూ కనీసం గంటసేపు రవికి భారతదేశాన్నిగురించీ, భారతీయసంస్కృతినిగురించీ, వీరపురుషుల జీవితాలనిగురించీ బోధిస్తూ యత్నం సాగించాడు. విజయసూచకంగా తోచింది అతనికి ఈపద్ధతి. 5 నెలల్లో రవి క్రమంగా తల్లిప్రేమతోపాటు దేశభక్తిని పెంపొందించుకొనడం ప్రారంభించాడు.

ఈమధ్య అనేకసార్లు డాక్టరుకు కలుసుకొన్నాడు ఉమాకాంత్. ఎప్పుడూ తను డబ్బు ప్రసక్తి తేవడం ఆయిన 'దానికేంలే' అనడం. చివరకోమాటు తేల్చాడు డాక్టరు సుమారు 150 రూపాయ లయ్యాయి రెండునెల్లకీ మందులకి. నా చేయగలసాయం ఊరికేనే చేశాను అని. ఉమాకాంత్‌కి ప్రాణగొడ్డంగా వుంది యీ బాకీ తీర్చడం.

సాధారణంగా కళాకారులకీ, ఆదర్శాన్ని పూజించేవారికీ ఈ లోకంలో లక్ష్మీప్రసన్నం కానేకాదు. తమదగ్గర కళ వున్నందుకు ఆత్మాభిమానం, స్వేచ్ఛాజీవితం వుండాలంటారు. ఏ కూలీనాలీ చేయరు. పోనీ నిత్యం ఆ శిల్పమైనా సాగించరు. ఎప్పుడో ఉద్రేకం కలిగినపుడు ఏవో కథలో, పద్యాలో వ్రాయడం, లేకపోతే కుంచె పుచ్చుకొని రెండు బొమ్మలు గీయడం, ఏఅయ్యకో అంటగట్టి నాలుగురాళ్లు సంపాదించుకొని కథ నడుపుకొంటూండడం, ఇదీ వారి పంథా. ఆధునిక యుగంలో సజీవకళలకీ, ధ్యేయవాదజీవనానికీ అన్నీ ప్రమాదాలే. ఇలాగే వుంది ఉమాకాంత్ జీవితం గూడా. ఏణ్ణర్థంనుంచి శ్రమపడుతూన్నా రవిస్కూలుజీతానికీ, పుస్తకాలకీ, తమ భుక్తికీ డబ్బు సంపాదించుకొనేందుకు ఇబ్బంది పడుతున్నాడు. పాపం! డాక్టరుగూడా మంచివాడుగాబట్టి అడపాతడపా అడుగుతూ మరీ ఎక్కువగా అతన్ని బాధపెట్టడంలేదు. ఉమాకాంతుడు కళాకారుడుగాబట్టి, తలచుకొన్నపుడల్లా ఆనాటి దృశ్యం జ్ఞాపకంవస్తూంటుంది గనుక ఎలాఅయినా యీ ఋణం తీర్చడానికి బాధపడుతున్నాడు.

ఇలా తపిస్తూన్న అతనికి ఓనాడు మంచి ఊహ తట్టింది. "ఉమాకాంత్! నీవు చిత్రకారుడవు. నీకు ఈ ఉపకారం చేసిన డాక్టరు ఋణవిముక్తికి ఎన్నాళ్లిలా తపిస్తావ్? తలచుకొంటే అమృతాన్నిచిందే నీ కుంచెతో గతవైభవానికి జీవం పోయగలవు. పిచ్చివాడా! నీ కళకి మూల్యం వుందా? రూ 150 లేంటి? తలచుకొంటే వేలుఖరీదుచేసే చిత్రాల్ని వ్రాయగలవు. లే. ఒక భావనాపూర్వకమైన చిత్రాన్ని చిత్రించి డాక్టర్‌చేత ఔననిపించుకో. నీ పేరు నిలిచిపోతుంది." ఆత్మప్రబోధపూర్వకంగావున్న ఈ ఊహ అతనిలో చైతన్యం రగుల్కొల్పింది.

తన ఊహ రవితో చెప్పాడు. తండ్రి వూహకి రవి సంతోషంతో మురిసిపోయాడు. అప్పటికే అతనిలో దేశభక్తి, మాతృప్రేమ వేళ్లు పాతుకొన్నాయి. ఒకనాడన్నాడు రవి తండ్రితో, "నాన్నా! నేను చెప్పేటంతటి యోగ్యుణ్ణి గాను. యీనాటికివినా చెప్పడం నా బాధ్యత గా గుర్తించాను గనుక చెబుతున్నా. సాధారచిత్రాలుగానీ; సుందరలలనల చిత్రాలుగానీ, భౌతిక సంపదల రూపులుగానీ కేవలం డాక్టరుఋణవిముక్తికని చిత్రించకు. నీ చేతిలోఉన్న అమృతం చిందే కుంచెతో మనపవిత్రమాతృగర్భంలో ఉద్భవించి, ఆ మాతృదేవిని సంరక్షించడానికి, పరదాస్యశృంఖలాలనుండి తల్లిని విముక్తి చేయడానికి తనమనధనపూర్వకత్యాగంచేసి మనకు తారలవలె నిరంతరం దారి చూపించే గతవైభవంలోని వీరులని చిత్రించు. తల్లిగర్భంనుండి జనించింది మొదలు, మళ్ళీ ఆ పవిత్రమాతృగర్భంలో లీనం అయ్యేవరకు శరీరంలోని ప్రతి కణమూ, జీవితంలో క్షణక్షణమూ ఆమెచరణపీఠంలో త్యాగంచేసిన దేశభక్తుల్ని చిత్రించి నీ శిల్పాన్ని సార్థకం చెయ్యి. ఇవి నీవు చెప్పిన రీతులేగా?" అని అనేకసార్లు తండ్రి తనతో చెప్పిన ప్రబోధసారాంశాన్ని అప్పగించాడు.

కొద్దికాలంలోన్నే రవిమనస్సులో తీవ్రమైన మార్పు తేగలిగినందుకు ఉమాకాంత్ గర్వించాడు. ఇదంతా తనలోగాకుండా ఆ దివ్యసంస్కృతిలో వుందని గుర్తించాడు. వెంటనే రవితో "రవీ! నీవు నాకిది చెప్పాలా నాయనా తల్లి ఋణం తీర్చుకోడం కోసం నేను జ్ఞానం వచ్చిననాటినుంచీ ఎలా ప్రయాసపడుతున్నానో నీకు తెలీదు. అదిగో చూడు ఆ భారతమాతచిత్రం చెబుతుంది నా ఆవేదనని. నేనింకో చిత్రాన్ని చిత్రించి నా కళని తుచ్ఛప్రాపంచికసౌఖ్యంకోసం, స్వార్థప్రయోజనానికీ ఎన్నడూ వినియోగించను. మంచి భావం తట్టిందిగనుక, నీవూ అదే కోరుతున్నావు గనక ఇవాళే ప్రారంభించుతా చిత్రాన్ని. కళారాధన, మాతృదేశసేవ ధ్యేయంగా ఉంచుకొన్న నాకుంచె నిత్యం ప్రదీపిస్తూ నాఎదుట నాకు నూతనోత్సాహం గలిగించే నీ రవితేజాన్ని గ్రహించి అమరజీవితాన్ని సృష్టిస్తుంది" అన్నాడు ఆనందంతో భారతమాతచిత్రాన్ని రవికి చూపుతూ.

ఆనాటినుంచి ప్రారంభమైంది ఉమాకాంతుని నూతనకార్యం. భావనాపూర్వకమై, జాతీయ ప్రతీకాలని ప్రతిబింబింపచేయగల చిత్రాన్ని వ్రాస్తున్నాడు. డాక్టరును చిత్రంతో సంతృప్తిపరచడం; అంతకన్నా ముఖ్యంగా మాతృచరణసేవా, పవిత్రాశయాలుగా ఉంచుకొని చిత్రంవ్రాస్తున్నాడు. రోజూ నిద్రాహారాలుగూడా మఱచి కార్యదీక్షలో మునిగి ఉన్నాడు. అప్పుడప్పుడు రవి తండ్రి స్వీకరించిన వ్రతాన్నీ ఆతని ఆదర్శాన్నీ చూస్తూ విస్మయపడుతూండేవాడు.

ఒకనాటి అర్ధరాత్రిసమయంలో నిద్రపోకుండా ఉమాకాంత్ చిత్రానికి రంగులు పట్టిస్తున్నాడు బుడ్డి దీపంవెలుతురులో. అకస్మాత్తుగా మెలుకువ కలిగింది. రవికి. లేచి తదేక దీక్షతో తండ్రిని గంటసేపటినుండి చూస్తున్నాడు. ధ్యేయనిష్ఠలో మునిగి ఆశయపూర్తికై యీప్రపంచాన్నే మఱచిపోయి శిల్పం సాగిస్తూన్న ఉమాకాంతుడు రవి లేచినట్లూ, తనను చూస్తున్నట్లూ గుర్తించలేదు. రవి చివరకి సాహసించి తండ్రివ్రతానికి భంగంచేస్తున్నానేమో అనే భయంతో బరువైనకంఠంతో, "నాన్నా! ఇలా ఎన్నాళ్లు పాటుపడతావు దీనికోసం? నీవు నిన్ను చూసుకోడంలేదు. నిద్రాహారాలు మానివేయడంవల్ల నీశరీరం కృశించిపోతోంది. ఏ వ్యాధియైనా వస్తుందేమో! కొంత విశ్రాంతి తీసుకోరాదూ! డాక్టరుగారి ఒత్తిడి ఏమీ లేకపోయినా నీకీవుపవాసాలూ, దీక్షా ఎందుకూ?' అన్నాడు. రవి ఇలా అంటుంటే ఉమాకాంత్‌కి స్పృహవచ్చింది.

(15 వ పేజీ చూడుడు)

ఉమాకాంత్ (లేక) (చిత్రకారుడు)

(11-వ పేజీ తరువాయి)

కాని ఇంకా అతడు ఎవరితో మాట్లాడుతున్నాడో అర్థంచేసుకోకుండా 'ధ్యేయవాది జీవనం అంటే ఇంకా నీకు తెలియదు. నీచిరుత హృదయం ఇంకా సంస్కారాలనూ, సాధననూ పొందితేగాని ఆసోపానం ఎక్కలేవు. కళకోసం నావంటివారు పొందే ఆవేదన నీకు అర్థం కావడం కష్టం. పిచ్చివాడా! నిద్రాహారాలు మానివేసే నంటున్నావా. ఆదర్శ జీవితాన్ని సృష్టించేవాడికి నిద్రాహారాలకి తావెక్కడిది? డాక్టరుకోసమా యీ చిత్రం? యీచిత్రనిర్మాణానికి డాక్టరు ఒక హేతువు ఆశయం, యీచిత్రంద్వారా జాతిలో చైతన్యం రగుల్కొల్పడమనే నా అంతిమఆదర్శాన్ని చేరుకోవడం. శరీరం స్రుక్కి, కృశించడం దీనికి ప్రాథమిక లక్షణాలుమాత్రమే. ఈపవిత్రాశయం సిద్ధించడానికి సర్వంలయం చేసినా ఋణవిముక్తికాదు' ఇంకా ఏమేమో ఇలా మాట్లాడుతూ మధ్యలో అకస్మాత్తుగా తను రవితో మాట్లాడుతున్నాననీ, అతడు ఇంకా ధ్యేయవాదిజీవనశిక్షణలో మొదటి తరగతిలోనే వున్నాడనీ గుర్తించాడు ఉమాకాంత్. వెంటనే సాధారణప్రపంచధోరణిలో 'అబ్బాయీ! పడుకో చాలా రాత్రి అయింది. నాకేం బాగానే వున్నాగా' అన్నాడు లేని నవ్వు తెచ్చుకొంటూ.

'నాన్నా! నీ కార్యానికి భంగం చేశానేమో. క్షమించు. నాకు తెలియక చేశా నీ పని' అని రవి మళ్లీ పడుకొన్నాడు.

ఇలా తలపెట్టిన చిత్రం ఆరునెలలకి పూర్తి చేయగలిగాడు ఉమాకాంత్. ఎంత తీవ్రంగా పనిచేస్తున్నా ఆకళాసృష్టి త్వరలో జరుపలేకపోయాడు. ఆలస్యమైనా తన సందేశాన్ని చిత్రంద్వారా చాలావరకు జాతికి అందజేయగలిగాననే తృప్తి అతనికి కలుగచేసింది.

ఉమాకాంతుడు చిత్రించింది రామాయణ కథాభాగంలోని ఒక ఘట్టం. శ్రీరామచంద్రుడు అడవికి పోతూవుంటే ఆ మహాపురుషుణ్ణి వెనుకకు రమ్మని ప్రార్థిస్తున్న భరతుణ్ణీ, తదితర అయోధ్యానగరపౌరుల్నీ చూపే చిత్రం. చుట్టూ అరణ్యం. ముందు ఒక మునీశ్వరుని ఆశ్రమం. భరతుడూ, పౌరులూ అయోధ్యకుతరలిరమ్మని శ్రీరాముని ప్రార్థిస్తున్నారు. కాని శ్రీరాముడు భావనకన్న కర్తవ్యం ఘనమైనదని పేర్కొంటూ తాను పదునాలుగేండ్లు గడచినగాని అయోధ్యకు తిరిగి రానని సూచిస్తున్న దృశ్యం. ఆద్యుసమ్రాట్టు కర్తవ్యపాలనను దేశానికి చూపుతున్నట్లుంది. ప్రకృతి కూడా దీనంగా ఆ ప్రభువుని ప్రార్థిస్తున్నా అతడు కర్తవ్యదీక్షను వీడకుండా వుండడం ఆ చిత్రంలో ప్రస్ఫుటమయ్యే విషయం. చిత్రానికి ఇటువంటి జీవంపోయడానికి ఉమాకాంతు డెంత తపించాడో? అనేకసార్లు ఆ చిత్రాన్ని చూసుకొని తానే పరవశుడౌతూండేవాడు

ఉమాకాంత్ ఒక సుముహూర్తాన రవితో, చిత్రం తీసుకొని డాక్టరుఇంటికి బయలుదేరేడు. ఆనాడు డాక్టరు తీరుబడిగానే ఉన్నాడు. హాల్లో కుర్చీలో కూర్చున్న డాక్టరుకి సాగిలి మ్రొక్కాడు రవి. అదేసమయంలో చక్కగా చట్రం కట్టించి కాకితంలో భద్రపరచబడ్డ పటాన్ని బల్లమీద ఉంచి వినయంగా నమస్కరిస్తూ "అయ్యా! మీరే వీడి ప్రాణదాతలు. రెండేళ్లయినా మీ ఋణం మల్లించుకోలేకపోయాను. క్షమించండి. ఏదో లేనివాణ్ణి. వున్న దాంట్లోనే యథాశక్తికష్టపడి యిచ్చాను. తీయించండి" అన్నాడు ఉమాకాంత్.

డాక్టరు పటంపై కాగితాల్ని నెమ్మదిగా తొలగిస్తున్నాడు. రవి ప్రక్కకి ఒదిగి నుంచున్నాడు. చిత్రాన్ని చూశాడు డాక్టరు. "అంతా బాగానే వుంది. ఉమాకాంత్ చూడూ! ఇక్కడ ప్రకృతి ఎంత అందంగా వుందో! కాగితంలో అమృతం చిలకడం అంటే ఇలా వుండాలి. ఏదో రామాయణగాథకి సంబంధించిన చిత్రంలా వుంది. ఇంకా మంచి ప్రకృతి రూపంతో ఆధునికరూపం చిత్రిస్తే బావుంటుంది.' అంటూ తలపైకెత్తి, "ఇదిగో! నువ్వు నవీనచిత్రాల్ని వ్రాయలేవూ? ఈనాటి ప్రజలను ఏ స్త్రీ చిత్రమో, ఏ శృంగారరసన్ని తేలేమో ఇట్టే ఆకర్షిస్తుందికదూ? ఏమంటావ్?' అన్నాడు కొద్దిగా అసంతృప్తిని ప్రకటిస్తూ.

'బాబూ! తమరు ఆనాడు రవికి భారత మాతనుగూర్చి బోధిస్తూ, అతని ధ్యానం మళ్లించమన్నారుకదూ? అందుకని యీ చిత్రాన్ని వ్రాశా. బాగులేదూ?' అని అడిగాడు ఉమాకాంత్. 'బాగానే వుంది. కాని నా సలహా ఇంకా బావుంటుందేమో అని. ఏమంటావ్?' అన్నాడు డాక్టరు

ఉమాకాంత్‌కి 'ఇంతపనీ చేసి యీయన్ని తృప్తిపరచలేకపోయానే?' అనిపించింది. ఆత్మగౌరవం కలవాడుకాబట్టి సాహసించి, "డాక్టర్ గారూ! కలాసృష్టికి అంతేమిటి? దేశకాలపరిస్థితులు మారినా విశిష్టతలు అలానే వుంటాయి" అన్నాడు ఆత్మాభిమానం ప్రకటిస్తూ. కాని ఆయన ఏమనుకుంటాడో అని మనస్సు బాధపడుతోంది

"ఉమాకాంత్! నాకు కళనిగూర్చి బాగా తెలియదు. ఏదో చిత్రం బాగానే వుందిలే" అన్నాడు డాక్టరు.

డాక్టర్ను తృప్తిపరచలేనందుకు ఉమాకాంత్ పరితపిస్తున్నాడు డాక్టరు తన కుమారుడు రఘూని పిలిచి చిత్రం హాల్లో గోడకి తగిలించమన్నాడు

రఘూ "నాన్నా! ఈ చిత్రం చాలా బాగుంది. రోజూ పూలమాలలుంచి పూజించాలి ఈమహావీరుణ్ణి. చిత్రాన్ని లిఖించిన ఉమాకాంత్ ధన్యుడు" అన్నాడు ఆనందంతో.

'ఏదో! వుంచుమూ' అన్నాడు తండ్రి విసుగుని సూచిస్తూ. శలవు తీసుకొన్నారు తండ్రీ కొడుకులు డాక్టరుకి నమస్కరించి. వారి వీడుగునా ఒకే ఆవేదన ఉమాకాంత్‌కి. 'ఇంతాశ్రమపడి ఈయన్ని తృప్తిపరచలేకపోయానే. ఆనాడు డాక్టరేదో అంటే నేను ఈయన్ని మెప్పించలేనా? అనుకొన్నానే—' అనుకొంటూ తనలో తర్కించుకొంటూ బరువెక్కిన హృదయంతో ఇలు చేరుకొన్నాడు.

అసలే కార్యదీక్షల్ల కృశించిన ఆ మనస్సుకి ఆయనఅసంతృప్తి మరీ బాధకలిగించింది. "అయ్యో! ఆయన ఏం చేస్తాడో చిత్రాన్ని? కొడుకునైనా పూజించనిస్తాడో లేదో, నా కార్యం, ఆశయం వృథా అయినట్లేనా?" అని ప్రతిదినమూ పరితపిస్తూ కృశిస్తున్నాడు.

ఇలా ఉండగా ఒకనాడు రఘూ వచ్చాడు వాళ్లింటికి. 'ఉమాకాంత్‌జీ, రేపు నా పుట్టిన రోజుపండుగ చేసుకొంటున్నాం. మీరు తప్పక ఆ ఉత్సవానికి రావాలి' అన్నాడు.

'రఘూ! మంచిదే. కాని దేహారోగ్యం బాగులేదు. క్షమించమని మీ నాన్నతో చెప్పు' అన్నాడు ఉమాకాంత్.

'భోజనానికి రాకపోయినా సాయంత్రం పెద్దలంతా వస్తారు. మీరు తప్పక రావాలి. హాల్లో అల్పాహారవిందు వుంటుంది' అన్నాడు రఘూ.

రఘూ 'హాలు' అనగానే ఉమాకాంత్‌కి ఆనాటి దృశ్యం గుర్తుకువచ్చింది. చిత్రం అందించి నమస్కరించేటం, డాక్టరు అసంతృప్తి వెలిబుచ్చడం ఒక్కసారి స్మృతివీథిలో ఆ కళాకారుడికి తారాడాయి. వెంటనే "రఘూ! ఆ శ్రీరాముని చిత్రం యింకా హాల్లోనే ఉందా?" అన్నాడు.

"హాల్లోనే ఉంది. కాని ఆ వాళ హాలు మధ్యగా గోడకి ఆనించి వుంచా బల్లలాద. కాని మా నాన్న యిష్టపడకపోవడంవల్ల ఒక మూలన ఉంచి నేనే పూలదండలుంచి పూజిస్తున్నా రోజూ. రేపు వస్తారుగా' అన్నాడు రఘూ.

'నే రాలేను నాయనా!' అన్నాడు ఉమాకాంత్.

'పోనీ - రవినేనా పంపండి, తప్పక. పంపుతారుగా' అన్నాడు రఘూ.

'అలాగే నాయనా. స్నేహితుడేగా? వాడే వస్తాడు పద' అన్నాడు ఉమాకాంత్. రఘూ వెళిపోయాడు.

'డాక్టరు నాసాంస్కృతికమూర్తిని ప్రముఖస్థానంలోంచి తొలగించాడా! పాపం. చిన్నవాడు రఘూయేనా గుర్తించినందుకుసంతోషం.' అనుకుంటూ రవిని పిలిచి "రవీ! రేపు సాయంత్రం డాక్టరుగారింటికి వెళ్లు. అంగులో వినయంగానూ, భక్తిగానూ మసులుకో. నీ తల్లి సూచించిన సౌశీల్యం అదే. జాగ్రత్తగా విషయాలను గమనించి రేపు రాత్రి నాతో చెప్పు" అన్నాడు సరే అన్నాడు రవి.'

మరునాడు సాయంకాలం డాక్టరుగారింటిలో అల్పాహారవిందు ఘనంగా జరుగుతోంది. చాలామంది పెద్దలు వస్తూన్నారు. హాల్లో కుర్చీలు, కుర్చీలకి ఎదుట బల్లలు అమర్చబడివున్నాయి. విందుకు వచ్చే పెద్దలలో అనేకులు ఖద్దరుధారులు, సూట్లలో వుండే పాశ్చాత్యపద్ధతుల్ని అనుకరించేవారు, ధనికులు, మధ్యతరగతి స్నేహితులు ఉన్నారు. పేరుపేరున వచ్చే ప్రతీపెద్దనీ డాక్టరు ఆహ్వానించి గౌరవిస్తున్నాడు. హాల్లో ఒక అలంకరింపబడ్డ కుర్చీలో క్రొత్తి బట్టలు ధరించి రఘూ కూర్చున్నాడు. అతనికి కొంతదూరంలో స్నేహితుడు రవి కూర్చున్నాడు. విందులో ఉన్నా రవి వచ్చేపోయేవారందరినీ జాగ్రత్తగా చూస్తూనే వున్నాడు. 'జరగే విషయాలను జాగ్రత్తగా చూచి నాతో చెప్పాలి' అన్న తండ్రిమాటలు రవికి చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ ధ్యానంతో కార్యక్రమంలో ప్రతీపనినీ శ్రద్ధగా గూస్తున్నాడు.

ఆ హాల్లోనే ఒకమూల ఉంది ఉమాకాంత్ వ్రాసిన చిత్రం 'కర్తవ్యపాలన' అనే పేరుతో. ఆ గోడకి చేరవగానే ముగ్గురు పెద్దలు సూటుల్లోనూ, ఇద్దరు కాంగ్రెసువారు ఖద్దరులోనూ ఉన్నారు ఆప్రక్కనే డాక్టరు వున్నాడు. పదార్థాలు ఒక్కొక్కటే తెచ్చి బల్లలపై వుంచుతున్నారు సేవకులు. ఈలోపుగా ఆ పెద్దలు వెనక్కి తిరిగి పటాలని చూస్తున్నారు. క్రమంగా వారి దృష్టి 'కర్తవ్యపాలన' అన్న చిత్రంపైకి ప్రసరించింది. మిక్కిలి నేర్పుతోనూ, ప్రత్యేకఆశయంతోనూ వ్రాయబడ్డ చిత్రం వారి నాకర్షించడంలో ఆశ్చర్యం లేదు. ప్రతీచిత్రాన్నీ చూస్తూ బాగోగులు వెల్లడిస్తూ నవ్వుకొంటున్నారు.

'డాక్టర్! ఈ చిత్రంలో ప్రకృతి, మహాపురుషుడు ఎంత చక్కగా చిత్రింపబడ్డారో? చిత్రకారుని నైపుణ్యం ఇక్కడే ఉంటుంది' ఇంకా ఏంటో అంటున్నాడు ఒకపెద్ద

'...ఏముంది అండీ! ఇరవయ్యో శతాబ్దంలో వుండీ గూడా మనవాళ్లింకా యీ పురాణాలలో ఘట్టాలు చిత్రిస్తారేమండీ? మనం సర్వత్రా అభ్యుదయం పొందలే దనడానికిది ఒక ఉదాహరణ కళలు, అలవాట్లు అన్నిటిలోనూ నవీనత్వం కావాలి ప్రాత పోయి క్రొత్తవస్తేనే శోభ' అంటూ వికటంగా నవ్వాడు సూటులో వున్న ఒక పెద్దమనిషి సభలోవాళ్లంతా నవ్వుకున్నారు.

ఇంత విందులోనూ యీ సంఘటన చూసిన డాక్టరుకి ప్రాణం చివుక్కుమనిపించింది. ఏదో సమాధానం చెబుదా మనుకొన్నాడు; కానీ అంతా గొర్రెల్లా మొదటి వినుర్శకుల్ని అనుసరించేశారు. ఇంకేం చేస్తాడు? దానివిషయమై మౌనమే మంచి దనిపించింది యీఆలోచనలో వుండి డాక్టరూ రఘూవైపు చూడలేదు.

రవి ప్రక్కనుంచి ఇదంతా చూస్తున్నాడు శ్రద్ధగా. వాళ్లనవ్వులూ, మాటలూ వింటూంటే అతనిని ఎవ్వరో సమ్మెటతో తలపై కొడుతూన్నట్లనిపించింది తన తండ్రి నెలలతరబడి నిద్రాహారాలను త్యజించి, రక్తమాంసాలను ఆవిరిచేసి, కాలయాపనని గణించక, తీవ్రమైన నిష్ఠతో, నిర్మల మాతృప్రేమతో రచించిన సాంస్కృతికచిహ్నాం నిండుసభలో అవమానింపబడింది. భారతీయులే తమ కళల విశిష్టతను గుర్తించలేని హీనస్థితికి వచ్చినందుకు దుఃఖం పొంగివస్తోంది అతనికి. ఒక్క యువకుడు ఏమనగలడు ఆ సభలో? వెంటనే రవికి మనోవేదన అధికమైంది. విందు సాగిపోతోంది. దేశాన్ని మోసంచేసే పెద్దలంతా నవ్వుకుంటూ పదార్థాల్ని మెక్కుతున్నారు. ఆ మాటలూ, నవ్వులూ చెవులారావిని బాధపడుతూన్న రవి ఏమీ తినలేకపోయాడు.

విందు అయిపోయింది. తరువాత గానకచేరీకి పెద్దలంతా బయట పందిరిలోకి వెళ్లారు. బరువెక్కిన హృదయంతో రఘూ వద్దంటూన్నా శలవుతీసుకొని యింటికి చేరాడు రవి. రవి యిల్లు చేరుకొనేసరికి చీకటిపడింది. ఇంట్లో ఇంకా దీపం పెట్టలేదు నాన్న. వెంటనే దీపం వెలిగించి మంచంమీద పరున్న ఉమాకాంత్ దగ్గరికి వెళ్లి ప్రక్కనే కూర్చున్నాడు.

గాలివేయడంవల్ల బుడ్డి దీపం ఆరిపోయింది. 'నాన్నా! దీపం వెలిగిస్తా' అని లేవబోయాడు రవి. 'రవీ! నీవుండగా దీపం ఎందుకు? నీవే ఈయింటికి కాంతివి' అంటూ ఉమాకాంత్ రవివీపు నిమురుతున్నాడు. అలా వున్న ఉమాకాంత్ చెక్కిళ్లపై రెండు వేడి కన్నీటి బిందువులు పడ్డాయి తండ్రి కంఠం వణికిపోయింది. 'రవీ! ఏడుస్తున్నావా? ఎందుకు? విందులో ఎవరేనా ఏమైనా అన్నారా? 'చెప్పు నాయనా' అన్నాడు బెదరిపోతూన్న హృదయంతో. విషయం తెలుసుకొందామన్న ఆవేదనతో వేడెక్కిన తండ్రిశరీరాన్ని తాకి రవి ఇంక నిజాన్ని దాచలేకపోయాడు

కళ్లనీళ్లు తుడుచుకొంటూ 'నాన్నా! ఏం చెప్పను? నీకూ, నాకూ మనవంశానికే కాదు కళకే తీరని అవమానం జరిగింది' అన్నాడు. ఏమిటి అది? అని అడిగాడు ఆతురతతో తండ్రి. 'నువ్వు అన్నాళ్లు కష్టపడి వ్రాసిన శ్రమకి గొడ్డలి దెబ్బ తగిలింది. ఆనాడు డాక్టరన్నది అంతగా నేను గమనించలేదు. ఈనాడు స్వయంగా పెద్దలు, గౌరవనీయులట! మన చిత్రంపోకడలను తూలనాడారు నే వినలేకపోయాను అపహాసాలు. నీచిత్రంలోనూ, కళలోనూ అభ్యుదయం లేదట' ఇంక ఏమీ చెప్పలేక దుఃఖిస్తున్నాడు రవి.

తుఫానులో కొట్టుకొంటున్న ఓడకు మళ్లీ ఒక పెద్ద కెరటం ఢీకొంది. ఉమాకాంత్‌కి ఒక గొడ్డలిపెట్టు ఈవార్త. తన ఆశయాన్నీ, ఆదర్శాన్నీ, కళనూ సమాజం సవాలుచేస్తున్నట్లుంది. 'ఔను. రవీ! దేశం స్వతంత్రతను పొందినా ఇంకా భావదాస్యం పోలేదు నాయనా. మళ్లీ పవిత్రభారతదేశంలో మన కళలు వెలుగొందడానికి కొన్ని యేండ్లు పడుతాయి. కాని ఇది తప్పక సంభవిస్తుంది. నే చూడలేకపోయినా నీవైనా తప్పక ఆ అభ్యుదయాన్ని చూడగలవు.' ఇలా చెప్పే తండ్రివాక్కులను వింటూన్న రవిఆత్మకు శాంతి కలిగి నిద్రపట్టింది ఆరాత్రి.

ఇక డాక్టరుఇంటిలో. విందు జరిగిపోయిన నాటిరాత్రి డాక్టరుకు నిద్ర పట్టలేదు. ప్రొద్దుటి నుండీ జరిగిన కార్యక్రమాలలోకల్లా సాయంత్రం జరిగిన విషయమే అతణ్ణి కించపరుస్తోంది. 'అసలు ఆ పటం ఆనాడే మూలపడేయవలసింది. పిల్లవాడు పూజచేసుకొంటానంటే సరే అనుకొన్నా. దీనికి తాళం వేస్తూ ఆనాడు రఘూ ఆ చిత్రానికి పెద్ద పూలదండకూడా వేశాడు ఇతర చిత్రాలకి దండలు లేకపోవడం; కొట్టొచ్చినట్లు ఆ బొమ్మకి పెద్ద దండ వుంచడం. నేనే ముందు పారబడ్డా ఎంత అవమానం జరిగింది?' అనుకొన్నాడు.

మరునాడుదయం రఘూని పిలిచి పటం తీసెయ్యమన్నాడు. రఘూ ఒప్పుకోలేదు. తండ్రి కోప్పడి పటానికి గుడ్డ కప్పి మూలపడెయ్యమన్నాడు రఘూ ఏం చేస్తాడు? శ్రద్ధగా కాగితాలు కప్పి దాచేశాడు చిత్రాన్ని. తండ్రి ఇలా కోప్పడిన దుకు రఘూ ఎంతో బాధపడ్డాడు. రెండురోజుల తర్వాత రవితో ఈ సంగతి చెప్పి చాలాసేపు విచారించాడు. అసలే బాధపడుతూన్న రవిహృదయానికి ఇది మరీ ఆవేదనను కలిగించింది.

రవి ఈ విషాదవార్త తండ్రితో చెప్పాడు. అసలే ఆరోగ్యం చెడి బాధపడుతూన్న ఉమాకాంత్‌ని ఇది మంచం ఎక్కించింది. జీవితంలో ఎన్నడూ ఎరుగని విఘాతాలు ఆ కళామూర్తికి. తత్త్వారాధకులకెప్పుడూ ఇలాంటి కష్టాలే ప్రాప్తిస్తూంటాయి. ప్రేమమయజీవనం సాగించే జీవితనౌకకి చుక్కాని తనభార్య నట్టేటిలో వదలి వెళ్ళిపోయింది. తుఫానులు చెలరేగాయి సముద్రంలో. ఎన్నో బాధలు. రవి జీవితం కళారాధనలో అంతిమఘట్టం. తనకు శాశ్వతానందాన్ని సౌఖ్యాన్ని కూరుస్తుందని మహాసౌధాలు నిర్మించుకొన్న ఉమాకాంతుడికి అవి గాలిమేడలైనాయి. రాలిపోలేక కునుకుతున్న తారలా

(16 పేజీ-చూడుడు)

పతనమార్గంలో ఉంది ఆతని బ్రతుకు. ఒక్క రవి కోసం తన బ్రతుకు ఇంక భూమి మీద. క్రమ క్రమంగా వ్యాధి ఎక్కువైతోంది ఆతనికి.

కాలచక్రం వేగంగా దొర్లిపోతోంది. రోజులు, నెలలు గడిచిపోయాయి. ఉమాకాంత్ స్థితి చాలా గడ్డుగా వుంది. రోజూ డాక్టరుని బ్రతిమాలి రవి మందు తెచ్చి పోస్తున్నాడు. ఒకనాడు తండ్రిచేత మందుమాకులు తెప్పించుకొన్న రవి, రాలిపోతాడనుకొన్న రవి యీనాడు తండ్రిబుణాన్ని మళ్లించుకొంటున్నాడు.

ఇలా వుంటూండగా ఆ మహానగరంలో కళా ప్రదర్శనం ఒకటి ఏర్పాటు చేశారు. దేశంలో నలుమూలలనుండీ చిత్రకారులు లలితకళా ప్రదర్శనానికి తమ చిత్రాలను పంపుతున్నారు. ప్రదర్శనం మూడురోజులలోనూ ఒకరోజు గడచిపోయింది. క్రమంగా ప్రదర్శనం సంగతి రవికిగూడా తెలిసింది. తన తండ్రితో చెప్పకుండా రెండో రోజున రవి ఉమాకాంత్ వ్రాసిన 'కర్తవ్యపాలన' అనే చిత్రాన్ని ప్రదర్శనానికి తీసుకెళ్లాడు. నగరంలో ప్రముఖులంతా ప్రదర్శనానికి ఆహ్వానించబడ్డారు. ఉత్తమ చిత్రానికి రు 500 లు బహుమానం యివ్వబడుతుందని తెలియజేశారు. చిత్రకళా ప్రదర్శనం జయప్రదంగా ముగిసింది.

ఈ మూడు రోజులలోనూ రవి ఇల్లు వదలి బయటకు రానేలేదు. తండ్రికి ఆరోగ్యం బాగు లేనందువల్ల డాక్టర్ గారిని బ్రతిమాలి మందు వేయిస్తున్నాడు. వ్యాధి ముదరడంవల్ల డాక్టర్ రోజల్లా ఉమాకాంత్ వద్దనే ఉండిపోయాడు. ఇలా ప్రదర్శనం మూడునాళ్లూ గడచాయి.

నాలుగోరోజున సమారోపణ జరుగుతుంది. ప్రసిద్ధకళాకారులు బహుమానం నిర్ణయించడానికి నియోగించబడ్డారు. ఆ సమారోపణోత్సవానికి నగరంలో పెద్దలంతా ఆహ్వానింపబడ్డారు. డాక్టరుకుగూడా ఆహ్వానం అందింది. ఎలాగో వీలుచేసుకొని ఉత్సవానికి బయలుదేరాడు. ప్రదర్శనమందిరంలో బ్రహ్మాండమైన సభ యేర్పాటుచేయబడింది. సభకు అందరితోపాటు రఘూకూడా వచ్చాడు. 'రాజే నంటూనా' ఉమాకాంతుని ఒప్పించి రవిని గూడా సభకు తీసుకువచ్చాడు రఘూ. సభలో కళాకారులు 'కర్తవ్యపాలన' అనే చిత్రం ఉత్తమబహుమతిని పొందినదని, చిత్రకారుడెవరో తెలియదని చెప్పారు. చిత్రం సభకు ఒకసారి చూపబడింది. సభఅంతా ఆ చిత్రానికి నమస్కరించారు. డాక్టర్ కు చిత్రం చూసేవరకు ఏమీ బోధపడలేదు. సభవారు ప్రశంసించే ఆర్భాటాన్ని చూసి నిర్ఘాంతపోయాడు. తన బుద్ధిమాంద్యానికి క్షణంపాటు తన్ను తానే నిందించుకొన్నాడు. రఘూ ఆనందానికి మేర లేదు. రవికి ఆశ్చర్యమూ, సంతోషమూ కలిగాయి. తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. వెంటనే డాక్టర్ లేచి చిత్రకారుడు 'శ్రీ ఉమాకాంత్' అన్నాడు. 'చిత్రం వ్రాసిన శ్రీ ఉమాకాంతునకూ, ఆయనపేరు తెల్పిన డాక్టర్ గారికీ ధన్యవాదాలన్నాడు' అధ్యక్షులు. రు 500 లు డాక్టర్ కు అందజెయ్యబడ్డాయి. సభ ముగిసింది.

వెంటనే ఇంటికి వచ్చాడు రవి. అప్పటికే ఉమాకాంత్ స్థితి క్రిందుమీదుగా ఉంది. రవిని చూడగానే 'నాయనా రవీ! యీ ఆఖరి క్షణంలో ఒక్కసారి నాదగ్గరకు రా' అన్నాడు తండ్రి. కన్నీళ్లతో రవి తండ్రిపై వ్రాలాడు. 'తండ్రీ. నీకృషిని పెద్దలు గుర్తించారు. కళా ప్రదర్శనంలో బహుమానం వచ్చింది మన 'కర్తవ్యపాలన'కు అన్నాడు. ఉమాకాంత్ కి యీ మాటలు వింటూంటే ఆనందబాష్పాలు పెల్లుబికాయి... 'పోనీలే! పోయేముందు యీజీవికి శాంతినిప్రసాదించే వార్త విన్నా. రవీ! ఆదర్శానిదే అంతిమవిజయం. జీవితంలో అప్పుడప్పుడు కష్టాలువచ్చినా నీ ఆదర్శాన్ని వీడకు నాయనా' అంటూ కన్నుమూశాడు ఆకళారాధకుడు ధన్యజీవి. వెంటనే ఆ బయట నిశీధంలో ఒకతార మెరుస్తూ..మింటికెగ ప్రాకింది.

మరునాడు ఉదయం డాక్టర్ రూపాయలు పట్టుకొచ్చాడు కళాకారుని గృహానికి. జరిగినదంతా గుర్తించాడు. కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నరవిని ఓదార్చడం ప్రారంభించాడు. రవిని డబ్బు తీసుకోమన్నాడు. "నాకు ఔషధమిచ్చినందుకు ఆచిత్రమూ, నాతండ్రికి ఔషధమిచ్చినందుకు ఈసొమ్మూ పరిగ్రహించండి' అన్నాడు దుఃఖిస్తూ రవి. డాక్టర్ ఖిన్నుడయ్యాడు. తప్పు క్షమించమని ఉమాకాంత్ ని ప్రార్థించాడు. మరునాటినుండి రవినిగూడా తనయింటనే వుండమన్నాడు. రోజూ రఘూ, రవి 'కర్తవ్యపాలన' చిత్రానికి పూజచేస్తూ తమ తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారు.

—

దేవుళ్ల దెబ్బలాటలు

శ్రీమతి నందివాడ పుతలీ

అనగాఅనగా ఒక బ్రాహ్మణు డుండేవాడు. ఆయన మహాపండితుడు. రాజుగారి ఆస్థానంలో కవిగా ఉండి, మహాపండితు లందరినీ భాషావాదంలో ఓడించిన మేధావి. కాని ఆయనకి పిల్లలు లేరు. పిల్లలకోసం ఘోరతపస్సు ప్రారంభించా డాయన. బ్రహ్మ ప్రత్యక్షమై 'నీ తపస్సుకి చాలా సంతోషించాను. ఏం కావాలో కోరుకో' మన్నాడు.

'స్వామీ నాకు పిల్లలు కావాలి' అన్నాడు. 'పిల్లలెందుకోయ్ వెధవపీడ వాళ్ళవలన నీకు సుఖం లేదు. యింకేదేనా కోరుకో' మన్నాడు.

పిల్లలు లేనప్పుడీ భోగభాగ్యము లన్నీ ఎందుకు? ఏ పాపమూ చెయ్యకపోయినా, పున్నామ నరకం తప్పదా తండ్రీ. సుఖం లేకపోయినా సరే. సంతానాన్ని ప్రసాదించు.' అన్నాడు.

'సరే అయితే నీకు ఐదోతనం లేని ఆడపిల్ల కావాలా అర్ధాయుస్సున్న మొగపిల్లవాడు కావాలా?'

'అదేమిటి! న్యాయమేనా ?కు. యిద్దరు ఆడపిల్లల్ని యిద్దరు మొగపిల్లల్ని ప్రసాదించి వారివలన అన్ని ముచ్చట్లూ తీరేటట్టు కరుణించు' మని ప్రతిమాలాడు.

'నిన్ను సృష్టించినప్పుడే పిల్లల యోగ్యత రాసి పారేస్తే యీ పీడ ఉండేది కాదు నాకు. అసలు నాకు నిద్రమత్తెక్కువవుతోందిలే. అందుకనే దేవతలంతా నన్ను వట్టి తెలివి తక్కువదద్దమ్మగా జమకట్టారు. నా మీద చాలా నేరాలారోపిస్తున్నారు. పదవీభంగమవుతుందేమోనని భయంగా ఉంది. అంటే నీకుకూడ ఉద్యోగం మాజేనా అంటావేమో! నా కది లేదు కాని ఉద్యోగం ఊడ పెరికి పొమ్మనడంకన్న మొగాడికి చిన్నతనం యింకేదైనా ఉందా! సౌఖ్యం లేనప్పుడీ పిల్లలయితే ఏం నీకు అంతమం దెందుకు? ఒక్కరిని కోరుకో. నీ మంచికోసమే చెప్తున్నా. అదీ కాక నీకు కావల్సింది పున్నామ నరకవిముక్తిమాత్రమే కదా' అన్నాడు.

'సరేలెండి. పుట్టి చచ్చినా పుత్రుడే మేలు. పోనీ ఒక కొడుకు నివ్వండీ చా' లన్నాడు.

బ్రహ్మ సంతోషించి వర మిచ్చి వెళ్ళిపోయాడు.

బ్రాహ్మణుడికి కొడుకు పుట్టాడు. బ్రాహ్మణుడు, భార్య ఎంతో సంతోషించారు. సోమయాజులుగారికి సాహిత్యగోష్ఠితో కాలం గడిచిపోయేది. ఆయన కొడుక్కి పాఠం చెప్పడానికి తీరిక ఉండేది కాదు. బ్రాహ్మణుడి భార్యకి కొడుకంటే అతిగారాబం. ఎప్పుడూ ఏవో తినడానికి పెడ్తూ కబుర్లు చెప్తో కూర్చునేది కుర్రాడితో. ఆమెకి తన కొడుక్కి చదువు చెప్పాలన్న ఊహే లేదు.

ఒకరోజున సోమయాజులగారింటికి ఆయన స్నేహితుడు వచ్చాడు. పిల్లాడిని చూడగానే వట్టి శుంఠని ఆయన గ్రహించాడు. 'పండితపుత్రః శుంఠః' అన్న వాక్కు సార్థకం చేశావురా తండ్రీ అని వేళాకోళ మాడాడు. సోమయాజులుగారికి తల తీసినట్టయింది. వెంటనే కొడుక్కి పాఠం చెప్పి. 'ఒరేయ్ అబ్బాయ్ నేను వచ్చేటప్పటికి నువ్వు యివి చదివెయ్యాలి' అన్నాడు. కొడుకు సరేనని తలూపాడు. ఆయన రాజసభకి వెళ్ళిపోయాడు.

సోమయాజులుగారింటికి వచ్చేటప్పటికి కొడుకు తల్లితో పచ్చీసు ఆడుతున్నాడు. ఆయనకి అరికాలి మంట నెత్తికెక్కింది. రామశాస్త్రి అన్నందుకేనా సిగ్గు లేదుట్రా. బ్రహ్మ ఎంత చెప్పినా వినలేదు. అప్పుడు బుద్ధి గడ్డి కరచింది. చెట్టుడిగేకాలానికి కుక్కమూతి పిందన్నట్టుగా బయల్దేరావ్. కాస్త భయం చెప్పి చదివించాలని నీకైనా తోచలేదుటే? సోమయజులు కొడుకు చవటపెద్దమ్మ అంటే నీకే కదూ చిన్నతనం. వెధవ! కడుపు చెడబుట్టావ్. నా కది అప్పచెప్తేకాని అన్నం పెట్టేది లేదని కేకలు వేశాడు.

అబ్బాయి కాసేపు చదివాడు. రాలేదు. పుస్తకం చేత్తో పట్టుకుని దిక్కులు చూస్తూ కూర్చున్నాడు. చీకటిపడింది. తల్లి అన్నానికని పిలిచింది. పాఠం వస్తేగాని అన్నం పెట్టడానికి వీల్లేదని సోమయాజులు గారు పట్టుబట్టారు. తల్లిచేసేది లేక ఊరుకుంది. పాపం అబ్బాయి కాకలి వేస్తోంది. వంటింట్లోకి తొంగి చూశాడు. తల్లి గిన్నెలు మూతపెట్టి నిద్రపోతోంది. సోమయాజులు గారు భోంచేయగానే ఎక్కడికో వెళ్లిపోయారు.

అబ్బాయికి ఏం చెయ్యడానికీ తోచలేదు. పక్కింటి పేరిశాస్త్రి 'ఒరేయ్' గుడిలో పూజ చూద్దాం వస్తావురా అని అడిగాడు. అబ్బాయికి ప్రాణం లేచివచ్చింది. పుస్తకం అక్కడే పడేసి గబగబా తల్లితోనైనా చెప్పకుండా గుడికి బయల్దేరాడు.

శివరాత్రికదూ! పూజ చాలాసేపు జరుగుతుంది. ప్రసాదం పెడ్తారుకదా పూజయ్యేదాకా ఉందామని సోమయాజులుగారబ్బాయి పూజ చూస్తూ కూర్చున్నాడు. పూజయిపోగానే పూజారి అందరికీ ప్రసాదం పంచిపెట్టాడు. కాని దానితో అతని ఆకలి తీరుతుందా! అందరూ ప్రసాదం పుచ్చుకుని వెళ్ళిపోతున్నారు. సమయం చూసి పళ్లెంలోని ప్రసాదం దొంగతనం చేద్దామని స్తంభంవెనక్కాల నక్కిఉన్నాడు. అందరూ వెళ్లిపోయారనుకుని పూజారి తలుపు దగ్గరగా వేసికొని పడుకున్నాడు.

ఇదే సమయమని అబ్బాయి తలుపు నెమ్మదిగా త్రోసి గర్భగుడిలో ప్రవేశించాడు. దీపం కొండెక్కిపోతోంది. చీకట్లో పళ్లెం కనిపించదంటే దని ప్రమిదలో చమురు పోసి వత్తి ఎగద్రోశాడు. కాని ఆతురతతో పళ్ళెం తీసికొంటోంటే పూజారి కాలు తగిలింది. పూజారి దొంగ! దొంగని అరిచాడు. చుట్టుపక్కలవాళ్లు పరుగెత్తుకునివచ్చి అబ్బాయిని కర్రలతో కొట్టారు. దెబ్బల తాకిడికి అతని ప్రాణం పోయింది.

పిల్లవాడి ప్రాణంకోసం యమకింకరులు వచ్చారు. శివుడు పంపడంచేత శివకింకరులు వచ్చారు.

ఇదేమిటి మీరు వచ్చారు వీడు మహాపాపి. శివప్రసాదం దొంగతనం చెయ్యడానికి ప్రయత్నించాడు. అలాంటి తుచ్ఛుణ్ణి తీసికొనివెళ్తారా మీ రని యమకింకరులు శివకింకరుల నడిగారు.

శివుడి గుడిలో దీపం కొండెక్కుతోంటే చమురు పోసి వత్తి నెగద్రోశాడు. శివపూజ కళ్లారా చూశాడు. శివసాన్నిధ్యంలో ప్రాణాలు విడిచాడు. వాడికి కైలాసం కాక మరేముందన్నారు శివకింకరులు.

'అలా వీల్లేదు. యమధర్మరాజు మమ్మల్ని తీసికొనిరమ్మన్నా' రని యమకింకరు లన్నారు.